ఆలయంలో అన్నదానం



జగద్గిరిగుట్ట: చింతల్‌లో శ్రీసాయి కాలనీ అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నేకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి, అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

కంచె ఏర్పాటు చేయరూ!



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. కంచె లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పక్కనే మోటారు మెకానిక్ షెడ్డు ఉండడం, నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన నేతలు

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను టీపీసీసీ చీఫ్‌కు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి వివరించారు. శనివారం ఆయనను కలిసి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాల గురించి చర్చించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కష్టపడే వారిని పార్టీ గుర్తిస్తుందన్నారు.

హోర్డింగ్‌ల తొలగింపు



దుండిగల్: నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసిన హోర్డింగులను హైడ్రా అధికారులు తొలగించారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి, డి.పోచంపల్లి ప్రధాన రోడ్ల వెంట ఉన్న హోర్డింగ్‌లను శనివారం స్థానిక మున్సిపల్ సిబ్బందితో కలిసి తొలగించారు.

విద్యుదాఘాతంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



జీడిమెట్ల: విద్యుదాఘాతంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బీరప్పనగర్‌లో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించగా.. ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సదరు వ్యక్తి 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

రానున్నది కమ్యూనిస్టుల రాజ్యమే

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జీడిమెట్ల: రానున్నది కమ్యూనిస్టుల రాజ్యమేనని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మభిక్షం స్ఫూర్తితో రానున్న సమావేశాల్లో ప్రజా సమస్యలను లేవనెత్తుతానని అన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు స్వామి ఉపాధ్యక్షుడు యేసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్, కార్యదర్శి శ్రీనివాస్, రవి, హరినాథ్ రావు, తులసి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ లేక పరేషాన్!

- పార్కింగ్ స్థలం లేక ఇబ్బంది పడుతున్న కొనుగోలు దారులు
- మినీ బేగంబజార్‌గా షాపూర్ నగర్ మార్కెట్
- పండుగల నేపథ్యంలో మరింత రద్దీ



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డు

సుభాష్‌నగర్: మినీ బేగం బజార్‌గా పేరొందిన షాపూర్ నగర్ మార్కెట్‌లో పార్కింగ్ సదుపాయం లేక కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరలో సరుకులు లభించే షాపూర్ నగర్ మార్కెట్‌కు నిత్యం వందలాది మంది కొనుగోలుదారులు వస్తుంటారు. స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు దారులు, అమ్మకం దారులు పెద్ద ఎత్తున రావడంతో నిత్యం ఈ మార్కెట్ రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనికి తోడుగా పక్కనే రైతు బజార్ ఉండడంతో వివిధ గ్రామాల నుంచి రైతులు కూరగాయలను విక్రయించడానికి ప్రతిరోజు వస్తుంటారు. కనీసం ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసే స్థలం కూడా లేకపోవడంతో **మార్కెట్‌కు వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి పక్కనే ఉన్న హెచ్‌ఎంటీ స్థలంలో పార్కింగ్ సదు**పాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హోల్ సేల్..

షాపూర్ నగర్ మార్కెట్ పేరు వినగానే హోల్ సేల్ ధర గుర్తుకు వస్తుంది. స్థానికంగా కిరాణ, బట్టలు, స్టీల్ సామాగ్రి, కూరగాయలు, తినుబండారాలు హోల్ సేల్ ధరలకే లభిస్తాయి. చుట్టుప్రక్కల ఉన్న ప్రాంతాల వారే కాకుండా ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో చిన్న చిన్న షాపులు నడిపేవారు ఇక్కడి నుంచే హోల్ సేల్ ధరలకు తీసుకెళ్తారు. నిత్యం కోట్లలో వ్యాపారం జరుగుతుంది. దీంతో **ఈ ప్రాంతం ఉదయం నుంచి రాత్రి వరకు జనాలతో కిటకిటలాడుతుంది.**

పండుగ దినాల్లో..

పండగ దినాల్లో ఒక రోజు ముందే షాపూర్ నగర్ మార్కెట్‌లోని కిలోమీటర్ వరకు అన్ని రోడ్లు రద్దీగా ఉంటాయి. గ్రామాల నుంచి పండ్లు, ఆకులు, పూలు విక్రయానికి ఇక్కడికి తీసుకొస్తుంటారు. ఇక దసరా, దీపావళి, సంక్రాంతి, రంజాన్ పండుగలకు వారం రోజుల ముందే షాపింగ్ వచ్చేవారు వేలల్లో వస్తుంటారు. దీంతో ఆ సమయంలో మరింత రద్దీగా ఉంటుంది.

ప్రయివేట్ వాహనాల్లోనే..

మార్కెట్‌కు వచ్చేవారికి సొంత వాహనాలు ఉన్న పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో బస్సు లేదా క్యాబ్, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. లేదా తమ వాహనాలను కిలోమీటర్ల మేర దూరంలో పెట్టి నడవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

కార్మికుల సంక్షేమమే ధ్యేయం



యాజమాన్యంతో అగ్రిమెంట్ చేసుకుంటున్న కార్మికులు

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడతామని కార్మిక నేత, యూనియన్ అధ్యక్షుడు చింతల నాగరాజు అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సాయి నార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 6వ సారి అగ్రిమెంట్ చేశారు. మూడు సంవత్సరాలకు గాను రూ.16 వేలు, కార్మికుల కుటుంబాలకు రూ.3 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, సంవత్సరానికి రెండు జతల బట్టలు, దసరాకు 20 శాతం బోనస్, ప్రతి ఉగాదికి ఒక గిఫ్ట్ ఇస్తామని సాయినార్ కంపెనీ యాజమాన్యం లిఖితపూర్వక హామీ ఇచ్చారు. శనివారం నగరంలోని డీసీఎల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్ రాజు ఆధ్వర్యంలో అగ్రిమెంట్ చేసుకున్నారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్స్ ఎస్పీ పుల్లయ్య నాయుడు, ఎస్ శ్రీనివాస్, హెచ్ఆర్ మేనేజర్ నాగమణి, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ రాజు, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీలు వాసు, శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నిరంజన్, రాంబాబు, ట్రెజరర్ రాఘవేందర్ రాజు పాల్గొన్నారు.

పాఠశాలలో ఇన్వెశ్చర్ సెర్మనీ వేడుకలు



మాట్లాడుతున్న అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్ : ప్రణవ్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో శనివారం 'ఇన్వెశ్చర్ సెర్మనీ 'వేడుకలు ప్రిన్సిపాల్ ఇందిరా ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు హాజరయ్యారు. స్కూల్ లీడర్స్ గా ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం తల్లిదండ్రులకు, విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కమిషనర్

నిజాంపేట్ : పార్కులో వసతుల కల్పనకు కృషి చేస్తామని కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. శనివారం తులసిరెడ్డి కాలనీ పార్కును కాలనీ వ్యవస్థాపకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పలువురు ఆయన దృష్టికి వివిధ సమస్యలను వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. సత్యరమే పార్క్‌లో వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ చేపడతామని తెలిపారు. వాలీబాల్ కోర్టు లేక ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులకు అనువైన స్థలం చూసి కోర్టు ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా కాలనీలో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ ఏలూరి సత్య, కాలనీ ప్రెసిడెంట్ కోయన రామకృష్ణ, సీనియర్ సిటిజన్స్ కృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పక్కకాలనీ బాలాజీహిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మి చిరంజీవి, సభ్యులు మహేశ్వరరావు, అక్బర్, సతీష్ బాబు, సురేష్, శివప్రసాద్, హరి తదితరులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల వరకు మొన్న జరిగిన హైడ్రా కూల్చివేతల వల్ల రోడ్డుకి అడ్డంగా పడిన చెత్తను తొలగించాలని కోరారు.

రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలి

ఎంపీ ఈటల రాజేందర్



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భౌరంపేట నుంచి బాచుపల్లి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. మల్లంపేటలో వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. మరో 10 రోజుల్లో రోడ్డులో నివాసాలు కోల్పోతున్న వారికి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, హెచ్ఎండబ్ల్యూఏ, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మామిడి సోమయ్య

సుభాష్‌నగర్: రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. శనివారం టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ తృతీయ మహాసభ సూరారంలోని వీబీపీ గార్డెన్‌లో సంఘం అధ్యక్షుడు గడ్డమీది అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేక పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించిందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షుడిగా పిట్ల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బి.శివకుమార్, కార్యదర్శిగా గోవిందరావు, ఉపాధ్యక్షులుగా మంజుల, దివాకర్, కావలి మోహన్, ప్రచార కార్యదర్శిగా పి. బ్రహ్మచారి, సహాయ కార్యదర్శిగా కొండ సంజీవ్ కుమార్, కోశాధికారిగా మన్నే వినోద్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మి, సుస్మిత, రాజు తదితరులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ తెలంగాణ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్(టీబీజేఏ) కన్వీనర్‌గా రాజేష్, కో కన్వీనర్లుగా కోటేశ్వరరావు, దుర్గారావు, శ్రీనివాస్, సత్య తదితరులు ఎన్నికయ్యారు.

నేడు ఈస్టర్ ఆరాధన వేడుకలు

నిజాంపేట్: హైదరాబాద్ కల్వరి గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈస్టర్ ఆరాధన వేడుకలు నిర్వహించనున్నట్లు పాస్టర్, సంఘం సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సాయినగర్ (గుట్టమీద), బాచ్‌పల్లి, కూకట్‌పల్లిలో ఎజీఎం ప్రార్థన మందిరంలో జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. ప్రార్థన అనంతరం విందు ఉన్నట్లు తెలిపారు.

రెండు నెలల డ్రైవింగ్ శిక్షణ తప్పనిసరి



సర్టిఫికెట్లు పొందిన వారితో ఇన్‌స్పెక్టర్ మల్లేష్

జీడిమెట్ల: డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ తీసుకునే వారు తప్పకుండా రెండు నెలలు శిక్షణ పొందాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. వివిధ డ్రైవింగ్ స్కూళ్లలో జీడిమెట్ల పోలీసులకు డ్రైవింగ్ శిక్షణ అందించారు. శనివారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య, ఎస్ఐలు నాయుడు, ప్రేమ్‌కుమార్, కానిస్టేబుళ్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



రంగారెడ్డినగర్: పోషణ్ పక్వాడ్ పక్షం కార్యక్రమంలో భాగంగా శనివారం గాంధీనగర్, రంగారెడ్డి నగర్ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రసన్న, అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ మోతీ, సీడీపీఓ రేణుక, సూపర్‌వైజర్లు శ్రీదేవి, విష్ణుప్రియ, జ్యోతి, బస్తీ అధ్యక్షుడు జల్దా లక్ష్మీనాథ్, ఏఎన్ఎం జగదీశ్వరీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం



తల్లిబిడ్డలతో 108 సిబ్బంది నరేందర్‌రెడ్డి, నవీన్

సుభాష్‌నగర్/జీడిమెట్ల: పురిటి నొప్పులు వచ్చిన మహిళను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో 108 వాహనంలో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బాచుపల్లికి చెందిన స్నేహ (28) డెలివరీ నిమిత్తం గాజులరామారంలోని కైసర్ నగర్‌లో పుట్టింటికి వచ్చింది. శనివారం ఉదయం పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. స్నేహను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఈఎంటీ నరేందర్ రెడ్డి, పైలట్ నవీన్ షాపూర్‌నగర్‌లోని గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారు.

రోడ్డును విస్తరించాలని వినతి



పైపులైన్ రోడ్డును విస్తరించాలని వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నుంచి సుచిత్ర చౌరస్తాకు వెళ్లే మార్గంలోని సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డును విస్తరించాలని పలువురు నేతలు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ కమిషనర్ నరసింహకు వినతి పత్రం అందజేశారు. సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో ప్రతి రోజు గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, పైపులైన్ దగ్గర ప్రస్తుతం ఉన్న 13 ఫీట్ల చిన్న బ్రిడ్జిని తొలగించి తక్షణమే నాలుగు లైన్ల బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరారు. 30 సంవత్సరాలుగా ఇదే బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నారని, నిత్యం వందలాది వాహనాల రాకపోకల కారణంగా వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆకుల సతీష్, నల్ల జైశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- జీడిమెట్ల గ్రామంలోని భాగ్య లక్ష్మి కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కాలనీలో హై కోర్టు ఆదేశాలను ఖాతారు చేయకుండా ఓ ప్రార్థనా మందిరానికి ప్రహరీని నిర్మిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. అవిజే జేమ్స్, నక్క ప్రకాశ్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

3 నెలల్లో .. 3 రోజులు కూడా తెరవలేదు!



జగద్గిరిగుట్ట: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రారంభించిన మహిళా శక్తి క్యాంటిన్‌లు మూలన పడుతున్నాయి. జగద్గిరిగుట్ట వార్డు ఆఫీస్ సమీపంలో 3 నెలల క్రితం ప్రారంభించారు. 3 నెలల్లో 3 రోజులు కూడా క్యాంటిన్ ఓపెన్ చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్యాంటిన్ ఓపెన్ చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కల్వర్టు పనులు పూర్తి

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు



పైపులైన్ రోడ్డులో పూర్తి చేసిన కల్వర్టు పనులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట నుంచి హెచ్ఎంటీ పైపులైన్ రోడ్డు మీదుగా షాపూర్ నగర్ వెళ్లే రోడ్డులో ఇటీవలే రూ.1.10 కోట్ల వ్యయంతో కల్వర్టు పనులు పూర్తి చేశారు. ప్రతీ వర్షాకాలం ఈ రోడ్డులో కల్వర్టు వద్ద నీరు పొంగి రోడ్డుపై పారడం, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఈ సమస్యపై గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఎంపీ ఈటల రాజేందర్ స్వయంగా పర్యవేక్షించి ఈ నిర్మాణం విషయమై జోనల్ కమిషనర్‌తో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు 3 నెలల క్రితం పనులు మొదలుపెట్టి ఇటీవలే పూర్తి చేశారు. దీంతో వాహనాదరులకు కాస్తా ఉపశమనం లభించినట్లైంది.

నేరాల అదుపునకు కెమెరాలు దోహదం

నిజాంపేట్: నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదపడతాయని బాలానగర్ డీసీపీ కె.సురేష్ కుమార్ అన్నారు. బాచుపల్లిలోని ఏపీ ఆర్ ప్రణవ్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీలో శనివారం సాయంత్రం 100 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి సీఐ ఉపేందర్, శ్రీనివాసులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఒకే దేశం.. ఎన్నిక ఎవరు ఆపినా ఆగదు

- ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు
- ఎంపీ ఈటల రాజేందర్



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

నిజాంపేట్: దేశంలో ఒకే దేశం, ఒకే ఎన్నిక అవసరమని, ఎవ్వరూ ఆపినా అది ఆగేది కాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నిజాంపేట్‌లోని ప్రగతినగర్ శ్రీకృష్ణగార్డెన్‌లో ఒకే దేశం..ఒకే ఎన్నికపై బీజేపీ కార్యకర్తలకు, నాయకులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల విధానంపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీజేపీ శ్రేణులపై ఉందన్నారు. అంబేడ్కర్ రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా దేశానికి ఒక పటిష్టమైన రాజ్యాంగాన్ని అందించారన్నారు. అంబేడ్కర్‌ను అవమానపర్చిన చరిత్ర కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. అందులో జవహర్‌లాల్ నెహ్రూ పాత్ర కూడా ఉందన్నారు. భారతజాతి గర్వించదగ్గ నాయకుడు నరేంద్రమోదీ అని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ప్రపంచంలోని ఏ దేశానికైనా తిండి పెట్టగలిగే స్థాయికి భారత్ చేరుకుందని అన్నారు. అహంకారానికి, దోపిడీకి ప్రజలు ఎప్పుడు ఓట్లు వేయరని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాధవి, జయ, కాంతారావు, దివాకర్, జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, మండల నాయకులు చౌదరి, బిక్షపతి, ప్రసాద్‌రాజు, డా.రాజు, విజయలక్ష్మి, సుబ్బారావు, రిటైర్డ్ ఇన్‌కంటాక్స్ కమిషనర్ తీపిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.